గుంతల రోడ్లతో చింత

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- బిల్లులు రాక నిలిచిన పనులు
- ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని ప్రజల వినతి

జిల్లాలో చాలా చోట్ల రోడ్లు గుంతలమయంగా మారాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నిధులలేమితో కొన్ని చోట్ల, కాంట్రాక్టర్లు ముందుకురాక మరికొన్ని చోట్ల రోడ్ల పనులు పూర్తకావడం లేదు. కంకర వేసి వదిలేయడంతో చాలా చోట్ల దుమ్మురేగుతోంది. రవాణా సౌకర్యాలు మెరుగుపడితే అభివృద్ధి పనులు జోరందుకుంటాయి. ఈవిషయమై ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లాలో రోడ్ల పరిస్థితిపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

– సాక్షి నెట్ వర్క్


నస్రుల్లాబాద్ : కంకర పోసి వదిలేసిన బొమ్మన్‌దేవ్ పల్లి- హాజీపూర్ రోడ్డు


బాన్సువాడ రూరల్: గుంతలమయంగా మారిన కోనాపూర్ -కాద్లాపూర్ రహదారి

బాన్సువాడ మండలం ఇబ్రహీంపేట్ గ్రామ పంచాయతీ పరిధిలోని రేకుల తండాకు బీటీరోడ్డు కోసం రూ.2కోట్ల 40లక్షలు మంజూరు చేసింది. దీంతో రోడ్డును చదునుచేసి కంకరపోశారు. ఎన్నికల తర్వాత నిధులు విడుదల కాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. బాన్సువాడ మండలం కోనాపూర్ గ్రామం నుంచి కాద్లాపూర్ మీదుగా సంగ్రాంతండా, అవాజ్‌పల్లి,

బాన్సువాడ నియోజకవర్గంలో..

హన్మాజీపేట్ వరకు గతంలో వేసిన బీటీరోడ్డు గుంతలమయంగా మారింది. నస్రుల్లాబాద్ మండలం సంగం హాజీపూర్ గ్రామాల మధ్య డబుల్ రోడ్డు పనులకు రూ.5.90 కోట్లు కేటాయించడంతో 4కి.మీ.మేర పూర్తి చేసి మిగితా 2కి.మీ. అలాగే వదిలేశారు. దుర్కి గ్రామం నుంచి మిర్జాపూర్ మీదుగా రోడ్డు పనులకు రూ.13కోట్లు కేటాయించగా, నస్రుల్లాబాద్ గ్రామంలో నిజాంసాగర్ ప్రధాన కాలువపై రోడ్డు పనులకు రూ. 1.35 కోట్లతో పనులు ప్రారంభించిన, బొమ్మన్‌దేవ్‌పల్లి నుంచి హాజీపూర్ వరకు రోడ్డు పనులకు రూ. 1.45 కోట్లతో పనులు ప్రారంభించిన మధ్యలోనే ఆగిపోయాయి.

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో..

తాడ్వాయి మండలం దేవాయిపల్లి, కరడ్‌పల్లి, కన్‌కల్, చిట్యాల గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా మారాయి. బ్రాహ్మణపల్లి శివారులో బ్రిడ్జిని నిర్మించారు, కాగా, బ్రిడ్జికి రోడ్డుకు మధ్యలో తారు వేయడకుండా వదిలేశారు. గాంధారి మండలం గాంధారి-బూర్గుల్, గాంధారి-బాన్సువాడ ప్రధాన రహదారి, గాంధారి నుంచి గుర్జాల్-బ్రాహ్మణ్‌పల్లి- రాంలక్ష్మణ్‌పల్లి నల్లమడుగు మీదుగా లింగంపేట్ వెళ్లే రోడ్లు గుంతలమయంగా మారాయి. ఎల్లారెడ్డి మండలం వెంకటాపూర్ గ్రామానికి బీటీ రోడ్డు కోసం ప్రభుత్వం రూ. 2.70 కోట్ల నిధులను మంజూరు చేసింది. పనులు చేసేందుకు గుత్తేదారులు ఎవరు ముందుకు రాక పోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కామారెడ్డి-మెదక్ జిల్లాలను కలుపుతూ నిర్మించదల్చిన రోడ్డు పనులు గత ఏడేళ్లుగా ముందుకు సాగడంలేదు. నాగిరెడ్డిపేట మండలం తాండూర్‌గేట్ అటవీప్రాంతంలో రోడ్డు నిర్మాణం పనులు మొదలవలేదు. తాండూర్, అక్కంపల్లి, కిచ్చన్నపేట, వెంకంపల్లి, మాసాన్‌పల్లి, మాటూర్ తదితర గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


గాంధారి: గాంధారి-బూర్గుల్ రోడ్డుపై ఏర్పడిన గుంతలు


ఎల్లారెడ్డిరూరల్: గుంతలమయంగా మారిన వెంకటాపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు

కామారెడ్డి నియోజకవర్గంలో..


కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలోని కోర్టు పక్కన నిలిచిపోయిన రోడ్డు పనులు

జిల్లా కేంద్రంలో కామారెడ్డి పాత బస్టాండ్ నుంచి కలెక్టరేట్, అడ్లూర్, పోసానీపేట రోడ్డు 80 ఫీట్ల వెడల్పు పనులకు 2022-23 ఆర్థిక సంవత్సరంలో నాన్ ప్లాన్ కింద రోడ్లు భవనాల శాఖ రూ.2 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఆ మార్గంలో ఆక్రమణలు తొలగించకపోవడంతో పాత బస్టాండ్ నుంచి రైల్వే గేట్ వరకు ఇరుకు రోడ్డులో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కోర్టు, ఆర్డీవో, జెడ్పీ, తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్లే రోడ్ల నిర్మాణం రైల్వే, మున్సిపల్ శాఖల సమన్వయం లోపంతో పనులు నిలిచిపోయాయి. రాజంపేట మండలం కొండాపూర్ ఎల్లారెడ్డిపల్లి గ్రామాల మధ్య నిర్మించిన నూతన బ్రిడ్జిల వద్ద బీటి రోడ్డు వేయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. బీబీపేట మండల కేంద్రానికి ఆమ్లేట్ గ్రామమైన రాంరెడ్డిపల్లికి గత ఏళ్లుగా బీటీ రోడ్డు లేదు. యాడారం గ్రామం నుంచి రాంరెడ్డి పల్లికి వెళ్లే రహదారిలో కంకర పోసి వదిలేశారు. మాచారెడ్డి మండలం మైసమ్మ చెరువు తండా నుంచి తడకపల్లి వరకు రెండు కిలోమీటర్ల వరకు బీటి రోడ్డు నిర్మాణం కోసం 2019లో రూ. కోటిన్నర నిధులను మంజూరు చేశారు. అటవీ శాఖ అధికారులు అభ్యంతరం తెలుపడంతో రోడ్డు నిలిచిపోయాయి. దోమకొండ మండల కేంద్రం నుంచి ముత్యంపేట వరకు డబుల్ బీటీ రోడ్డు పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు.


బిచ్కుంద : కందర్‌పల్లి రోడ్డు పై తేలిన గుంతలు

జుక్కల్ నియోజకవర్గంలో..

బిచ్కుంద మండలం దడ్గి, వాంతాపూర్, బిచ్కుంద కందర్‌పల్లి, రాజుల్లా రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. పిట్లం మండల కేంద్రంలో రూ.12 కోట్ల నిధులతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. రోడ్లకు ఇరువైపులా గుంతలను తవ్వి వదిలేశారు. పిట్లం మండలం కుర్తి గేటు నుంచి కుర్తి గ్రామానికి, గోద్మెగాం నుంచి కంభాపూర్ గ్రామానికి, చిల్లర్గి, అల్లాపూర్, బురన్పూర్, పారేడ్‌పల్లి, మార్దండ తదితర గ్రామాలకు వెళ్లే రోడ్లు పూర్తిగా గుంతలమయంగా మారాయి. పెద్దకొడప్‌గల్ మండలం అంజని గ్రామం నుంచి శివాపూర్ వరకు రూ.6లక్షల నిధులతో రోడ్ల పనులు ప్రారంభించి విడిచిపెట్టారు. విఠల్ వాడీ తండా నుంచి పోచారం తండా వరకు 3.5 కి.మీ రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్లు కేటాయించగా కంకరపోసి వదిలేశారు. మద్నూర్ మండలం చిన్న ఎక్లార, కోడిచిర వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది.

క్లుప్తంగా

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ


చెక్కులు అందజేస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ : పట్టణంలోని పలువురు లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆదివారం వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌లు అందజేశారు. నియోజకవర్గంలోని బాన్సువాడ అర్బన్, రూరల్ మండల పరిధిలోని 59 మంది లబ్ధిదారులకు రూ.59,06,844 లక్షల చెక్కులను అందజేసినట్లుతెలిపారు.

దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ



భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో దొడ్డికొమురయ్య విగ్రహాన్ని కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు గొరిగె నర్సింహ కురుమ ఆదివారం ఆవిష్కరించారు. ప్రతి ఒక్కరూ దొడ్డికొముర్య పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కురుమ యువచైతన్య సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పెద్దోళ్ల మహేష్, జిల్లా ఉపాధ్యాక్షుడు ఎర్రొళ్ల స్వామి, నేతలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్సీవిభాగం నియోజకవర్గం అధ్యక్షుడిగా శివాజీ


నియామక పత్రం అందుకుంటున్న శివాజీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని సంగోజీవాడి గ్రామానికి చెందిన గైనిశివాజీ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈమేరకు నియామక పత్రాన్ని ఎమ్మెల్యే మదన్ మోహన్ నుంచి అందుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు మేకల రాజు, భాగయ్య, లింగాగౌడ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన జొన్న పంట

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని వెల్లుట్ల గ్రామ శివారులో జొన్న పంట నేలకొరిగింది. ఇటీవల ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షం కారణంగా చేతి కొచ్చిన జొన్న పంట నేల కొరిగిందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ఇంటి ఆవరణలో చెత్త వేయొద్దు

ఎల్లారెడ్డి: ఇంటి ఆవరణలో చెత్త వేయరాదని స్వచ్ఛ సర్వేక్షణ్ సిబ్బంది ప్రజలకు సూచించారు. ఆదివారం పట్టణంలోని పలు వార్డులలో ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తను వేరుచేసి చెత్త సేకరించే సిబ్బందికి అందించాలని సూచించారు. సిబ్బంది, తదితరులున్నారు.

చలో హైదరాబాద్ జయప్రదం చేయాలి

కామారెడ్డి టౌన్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కారానికి మంగళవారం నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

మొగిపురుగు నివారణపై అవగాహన


పోచారంలో లింగాకర్షక బుట్టలపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): యాసంగి సీజన్లో సాగుచేస్తున్న వరిపంటలో మొగిపురుగు నివారణ కోసం లింగార్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని హైదరాబాద్ రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు సూచించారు. మండలంలోని పోచారం గ్రామంలో ఆదివారం చేపట్టిన ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మొగిపురుగు నివారణ కోసం పంట మధ్యలో అక్కడక్కడ లింగార్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. రసాయన రహిత కూరగాయలను, పండ్లను పెంచుకోవడంతో కలిగే ప్రయోజనాలను వివరిస్తూ గ్రామంలో ర్యాలీ చేపట్టారు. సమీపంలోని రైస్‌మిల్లులో బియ్యం ఉత్పత్తి అయ్యే తీరును వారు పరిశీలించారు. మాల్తుమ్మెద సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాత సిద్దరామేశ్వర స్వామి ఆలయాన్ని పట్టించుకోవాలి

భిక్కనూరు: మండల కేంద్రంలోని పాత సిద్దరామేశ్వరస్వామి ఆలయాన్ని (సిద్దగిరి,రామగిరి సమాధి) ఎండోమెంట్ అధికారులు పట్టించుకోవాలని గ్రామస్తులు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో సిద్దగిరి రామగిరి సమాధి ప్రాంతంలో గ్రామస్తులు సమావేశమయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సమయంలో మాత్రమే సున్నం వేయించడం మినహా కనీసం ధూప దీపాలను కూడా వెలిగించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దరామేశ్వరాలయం అభివృద్ధికి భక్తులు అందజేస్తున్న విరాళాల్లో పది శాతం విరాళాలను ఈఆలయ అభివృద్ధికి కేటాయించాలని డిమాండ్ చేశారు.అలాగే ఊరడమ్మ ప్రాంతంలో ఉన్న కాలబైరవస్వామి ఆలయాన్ని పునర్మిర్మాణం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. ఇందుకోసం ప్రతి కులం నుంచి ఐదుగురిని ఎంపిక చేశారు.


భిక్కనూరులో సమావేశమైన గ్రామస్తులు

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

బాన్సువాడ రూరల్: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు శాసన సభ ఆమోదం తెలిపినందుకు ఆదివారం మండలంలోని కొత్తాబాది గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, దళితులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వర్గీకరణ పోరాటాన్ని ముందుండి దశాబ్దాలపాటు నడిపించిన మందకృష్ణ చిత్రపటానికిసైతం పాలాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు సాయిలు, నాని, శ్రీనివాస్, రంజిత్, శ్యామ్, గంగాధర్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

గొట్టిముక్కులలో భీమ్ వాక్ చేసిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

దోమకొండ: బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆదివారం ఉదయం భీమ్ వాక్ చేశారు. భిక్కనూరు మండలం అంతంపల్లిలో శనివారం రాత్రి పల్లెనిద్ర చేసిన ఆయన ఆదివారం ఉదయం అంతంపల్లి నుంచి గొట్టిముక్కుల గ్రామం మీదుగా దోమకొండ పెద్దమ్మ ఆలయం వరకు భీమ్‌వాక్ కార్యక్రమంలో పాల్గొన్నారు. దాదాపు 10 కిలోమీటర్ల వరకు వాకింగ్ చేశారు. వచ్చేనెల 14న అంబేడ్కర్ జయంతి వరకు భీమ్‌దీక్షలో భాగంగా పల్లెనిద్ర కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆయన వెంట స్వైరోస్ రాష్ట్ర అధ్యక్షుడు వీరన్న, లైఫ్ ఎన్‌జీవో సంస్థ నిర్వాహకులు దేవరగట్టు బాలప్రసాద్, ప్రతినిధులు దుర్గయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

25న బాన్సువాడ తైబజార్ వేలంపాట

బాన్సువాడ రూరల్: ఈనెల 25న బాన్సువాడ మున్సిపాలిటీలో తైబజార్ వేలంపాట నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు. బాన్సువాడతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన ఆసక్తి ఉన్న వారు వేలంపాటలో పాల్గొనాలని ఆయన సూచించారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలానికి రూ. 60 లక్షల నిధులు మంజూరైనట్లు దిశ అడ్వైజరీ కమిటీ సభ్యుడు దేశ్‌ముఖ్ రాజు తెలిపారు. ఉపాధి హామీ కింద ఈనిధులను సీసీ రోడ్లు, గ్రామ పంచాయితీ, అంగన్‌వాడీ, పాఠశాల భవనాల నిర్మాణానికి వినియోగిస్తామన్నారు.

'కవిత్వం మనిషికి బాసటగా నిలవాలి'

కామారెడ్డి అర్బన్: కవిత్వం సగటు మనిషికి బాసటగా నిలవాలని, సమస్యలను పరిష్కరించే మార్గంలో దిశా నిర్దేశం చేయాలని తెలంగాణ రచయితల వేదిక (తెరవే) జిల్లా అధ్యక్షుడు సిరిసిల్ల గఫూర్ శిక్షక్ అన్నారు. ఆదివారం స్థానిక సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనంలో మాట్లాడారు. తెరవే సాహితీసభలు, సమావేశాలకు ఎప్పుడు ముందుంటుందన్నారు. సమ్మేళనంలో కాసర్ల రామచంద్రం, చంద్రకాంత్, యెనిశెట్టి గంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

28న తెరవే ఉగాది కవి సమ్మేళనం

తెరవే ఆధ్వర్యంలో ఈనెల 28న శుక్రవారం సాయంత్రం ఐదుగంటలకు సీనియర్ సిటిజన్స్ ఫోరం భవనంలో ఉగాది కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు, పాల్గొనే కవులకు ప్రశంసపత్రం, సన్మానం చేస్తామని తెరవే జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్ తెలిపారు.


మాట్లాడుతున్న గఫూర్ శిక్షక్

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


మాందాపూర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న బీజేపీ నాయకులు


దూప్‌సింగ్ తండాలో.. కాంగ్రెస్ నాయకులు

బీబీపేట/నిజాంసాగర్/నాగిరెడ్డిపేట: బీబీపేట మండలం మాందాపూర్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 10 లక్షలతో ఆదివారం సీసీ రోడ్డు పనులను బీజేపీ నాయకులు ప్రారంభించారు. మహమ్మద్‌నగర్ మండలం దూప్‌సింగ్ తండా జీపీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను యూత్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సంతోష్‌రాథోడ్ ప్రారంభించారు. నాగిరెడ్డిపేట మండలం వదల్పర్తి, మెల్లకుంటతండాల్లో సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు.ఈకార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు ప్రవీణ్,కాంగ్రెస్ పార్టీల, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ నిలదీత

బాన్సువాడ రూరల్: మండలంలోని కొత్తాబాది గ్రామంలో ఆదివారం గ్రామస్తులు ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్‌ను నిలదీశారు. గ్రామానికి చెందిన అనిల్ అనే ఉపాధి హామీ కూలీ తన కూలీ రూ.4వేల డబ్బులను పోస్టాఫీస్ నుంచి తనకు తెలియకుండా ఎఫ్ఏ తీసుకున్నట్లు ఆరోపించారు. తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.


ఫీల్డ్ అసిస్టెంట్‌ను నిలదీస్తున్న గ్రామస్తులు

ఆధ్యాత్మికం

జంగపల్లిలో బోనాల ఊరేగింపు


బోనాల ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి గ్రామంలో వనదుర్గ ఆలయ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆదివారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు నిర్వహించారు. మహిళలు బోనాలను అమ్మవారికి సమర్పించారు.

కొల్లూర్‌లో ఘనంగా ఎడ్లబండ్ల జాతర



బాన్సువాడ రూరల్: మండలంలోని కొల్లూర్ గ్రామంలో ఆదివారం ఎడ్లబండ్ల జాతర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన రైతులు ఎడ్ల బండ్లను మామిడి తోరణాలు, రంగురంగుల పూలు, చీరలతో అందంగా అలంకరించారు. గ్రామదేవతల విగ్రహాల చుట్టూ ప్రదక్షిణ చేయించారు. గ్రామకమిటీ అధ్యక్షులు పరిగె బాపు రెడ్డి గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు శివపార్వతుల కల్యాణం...

సదాశివనగర్: మండల కేంద్రంలోని శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి కల్యాణం సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. భక్తులు భారీసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

ఆలయ అభివృద్ధి కోసం విరాళం



మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ శ్రీ లక్ష్మీనర్సింహాస్వామి ఆలయం అభివృద్ధి కోసం రాజన్న-సిరిసిల్లా జిల్లా గంభీరావుపేట మండలం నర్మాలకు చెందిన తిరుపతిరావు-కవిత దంపతులు రూ. 51వేల ఆదివారం విరాళంగా అందజేశారు.తమ కుమారుడి తొలి మాసం వేతనాన్ని స్వామి వారి ఆలయ అభివృద్ధికి అందజేశామన్నారు.

హనుమాన్ ఆలయ నిర్మాణానికి ..

నస్రుల్లాబాద్: మండలంలోని సంగం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ ఆలయ నిర్మాణానికి ఆదివారం బీజేపీ నాయకులు కోనేరు శశాంక్ రూ.11 వేలు విరాళం అందించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే బీజేపీ పార్టీ మండలాధ్యక్షులు సున్నం సాయిలు రూ.2500 విరాళం ఇచ్చారని పేర్కొన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

బాన్సువాడ : ఈ నెల 25, 26,27వ తేదీల్లో నిజామాబాద్‌లో జరిగే రైతు సంఘం 3వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని నియోజకవర్గ సీపీఐ ఇన్‌చార్జి దుబాస్ రాములు అన్నారు. ఆదివారం బాన్సువాడ సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నేతలు అంజయ్య, లక్ష్మీనారాయణ, భూమయ్య, లలిత, సతీష్, స్వప్న తదితరులున్నారు.

సంక్షిప్తం

ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ సబార్డినేట్ అసోసియేషన్ కార్యవర్గం

కామారెడ్డి అర్బన్: ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ (ఆర్థిక గణాంక శాఖ) సబార్డినేట్ అసోసియేషన్ ఎన్నికలు టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి, కార్యదర్శి ముల్కనాగరాజు, ఉపాధ్యక్షుడు యు.సాయిలు పర్యవేక్షణలో నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడుగా లక్ష్మణ్, కార్యదర్శిగా రమేష్, కోశాధికారిగా స్రవంతిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీఎన్జీవోస్ ప్రతినిధులు చక్రధర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ అర్చక పురోహిత సంఘం జిల్లా..

కామారెడ్డి అర్బన్: విశ్వబ్రాహ్మణ అర్చక పురోహిత సంఘం జిల్లా అధ్యక్షుడుగా చుక్కాపూర్‌కు చెందిన బ్రహ్మకంది రఘునాథచారి రెండో సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా దేవరకొండ నరేష్‌శాస్త్రి (కామారెడ్డి), కోశాధికారిగా అల్వాల శ్రీనివాస్ (కామారెడ్డి) గౌరవ అధ్యక్షుడిగా శిర్లవంచ శ్రీనివాస్‌చారి (టేక్రియాల్) ఉపాధ్యక్షులుగా అరూర్ శ్రీనివాసాచారి, కొండ రామచంద్రంచారిలు ఎన్నికయ్యారు.

పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ కమిటీ..

దోమకొండ: మండలంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా కంది రాజయ్య, ఉపాధ్యక్షుడిగా కమ్మరి శ్రీనివాస్, ఆరేపల్లి రమేష్, కార్యదర్శిగా బాలచంద్రం, శ్రావణ్, ఉప కార్యదర్శిగా సిద్ధ రాములు, నరహరి, క్యాషియర్‌గా ఆచారి, వెంకట్, సహాయ కోశాధికారులుగా కాళిదాస్, శేఖర్, సలహాదారులుగా కమ్మరి రమేష్, లింబాద్రి, ముత్యం, వడ్ల రమేష్ తదితరులను ఎన్నుకున్నారు.

వారధి స్వచ్ఛంద సేవ సంస్థ ..

బాన్సువాడ : వారధి స్వచ్ఛంద సేవ సంస్థ నూతన కార్యవర్గాన్ని బాన్సువాడలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సుధాకర్, అధ్యక్షులుగా శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా సంజీవ్, ప్రధాన కార్యదర్శిగా మహేందర్, కోశాధికారిగా వేణుగోపాల్, సహాయ కార్యదర్శిగా క్రిష్టాగౌడ్, కార్యవర్గ సభ్యులుగా కృష్ణ, శ్రీనివాస్, కోటయ్యలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు మాట్లాడుతూ 2010లో వారధి స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశామన్నారు. సంస్థ సభ్యులు పాల్గొన్నారు.